క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

హబ్సిగూడ: ఉప్పల్ డివిజన్‌కు చెందిన రాములుకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.40 వేల చెక్కును గురువారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి చేతులమీదుగా అందచేశారు. బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్, కాసం మహిపాల్ రెడ్డి, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



రామంతాపూర్: దేశవ్యాప్తంగా జరిగిన క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో రామంతాపూర్ శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్, నగదు, బహుమతులను స్కూల్ ఏజీఎం సతీష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మీ, సనంజీ, రాజేంద్రప్రసాద్, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

మౌలాలి: డివిజన్ సంతోషిమానగర్ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం బీజేపీ సీనియర్ నాయకులు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయన తెలిపారు. వెంకటేష్ నేత, జాంగీర్, రాము పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



రామంతాపూర్: గోవాలో ఇటీవల నిర్వహించిన జపాన్ కరాటే నేషనల్ టోర్నమెంట్‌లో రామంతాపూర్ కామాక్షిపురం ప్రాంతానికి చెందిన విద్యార్థులు సీహెచ్.తేజేశ్వర్, బిగ్గ సింహారెడ్డి, శ్రీకాంత్ అంతర్జాతీయ బెల్టులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కోచ్ నవీన్‌నాయక్, విశ్వనాథం, సుదర్శన్ గురువారం అభినందించారు.

ఏఐటీయూసీ ధర్నాను జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు


మేడిపల్లి: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మేడిపల్లిలో గురువారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. రంగా, సులోచన, భూతం ఐలయ్య, మనోహరి, రాములమ్మ, సులోచన, సుశీల, కృష్ణకుమారి, పోచమ్మ పాల్గొన్నారు.

చిలుకానగర్ ఎస్సీ సెల్ నూతన కమిటీ



ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ కమిటీని గురువారం ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఎస్సీసెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాదమంచి కృష్ణ, ఉపాధ్యక్షులుగా జేమ్స్, పూర్ణ, ప్రధాన కార్యదర్శిగా తరుపాటి జంగయ్య, జాయింట్ సెక్రటరీగా నిదానకవి జగన్నాథ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా వస్తం ప్రవీణ్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడు కొంపల్లి బాలరాజు, లింగంపల్లి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఐక్యత చాటాలి



కుషాయిగూడ: ఉప్పల్ భగాయత్‌లో శనివారం నిర్వహించే తెలంగాణ వంజరి సంఘం భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరిపే ప్రవీణ్ వంజరి కోరారు. మంత్రులు గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, చామకూర మల్లారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యేలు బేతి సుభాష్‌రెడ్డి, కాలేరు వెంకటేష్ హాజరవుతున్నట్లు తెలిపారు.

వ్యర్థాలతో అవస్థలు



గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. మిర్జాల్‌గూడ చిన్మయి మార్గంలో నాలా పక్కన చెత్త కుప్పలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాలు కుళ్లిపోయి కంపుతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలని కోరుతున్నారు.

ఆదమరిస్తే ప్రమాదాలు



గౌతంనగర్: డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ మార్కెట్ గల్లీ అంతర్గత రోడ్డులో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో విద్యుత్ స్తంభాలు కనిపించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఏళ్లు గడుస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

పాదచారికి కష్టాలు

మౌలాలి: రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు నిర్మించినా ప్రయోజనం లేకుండా పోయింది. రోజురోజుకూ ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. దీంతో నడిచేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. సైనిక్‌పురి జలమండలి కార్యాలయం సమీపంలో ఫుట్‌పాత్‌లపై నర్సరీలు, పూల కుండీలు, మట్టి వ్యాపారాలు, హోటళ్లతో పాటు పంచర్ దుకాణాలు వెలిశాయి. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అయినా అధికారులు మాత్రం స్పందించడం లేదు.



నాణ్యమైన విద్యే.. ప్రభుత్వ సంకల్పం..

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



చిన్న చర్లపల్లిలో మోడల్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబస్తీ–మనబడి కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.28 లక్షలతో ఆధునీకరించిన చిన్న చర్లపల్లి యంపీఎస్ ప్రభుత్వ పాఠశాలను గురువారం స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో సన్నగిల్లిన విశ్వాసాన్ని తల్లిదండ్రుల్లో నింపేందుకే మనబస్తీ–మనబడి కార్యక్రమానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రైవేటుగా ధీటుగా విద్యాబోధన సాగేలా అవసరమైన చర్యలు తీసుకుంటూ విద్యా ప్రమాణాలు పెంచేందుకు సర్కారు చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తూ ఉద్యమంలా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. జిల్లా విద్యాధికారి విజయ కుమారి, డీఈ రవీందర్‌గౌడ్, ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, జౌండ్ల ప్రభాకర్‌రెడ్డి, బొడిగె రాజు, బొడిగె ప్రభుగౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, జౌండ్ల సత్తిరెడ్డి, గిరిబాబు, గంప కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, ఆల్వా లక్ష్మారెడ్డి, కొమ్ము సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓబీ పనులు వేగవంతం చేయాలి

చర్లపల్లి ఆర్‌ఓబీ పనుల్లో వేగం పెంచాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అధికారులకు సూచించారు. అధికారులతో కలిసి చర్లపల్లి ఆర్‌ఓబీ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఆర్‌ఓబీ పనులు చివరిదశకు చేరుకున్నాయని, మరో 45 రోజుల్లో పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జౌండ్ల ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్, సారా వినోద్, ఉపేందర్, శ్యామ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ్మైడ్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి

చర్లపల్లి డివిజన్ లక్ష్మీ్మైడ్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు గురువారం ఆయన లక్ష్మీ్మైడ్‌ను సందర్శించారు. అధికారులతో మాట్లాడి వసతుల కల్పనకు సహకారం అందజేస్తానన్నారు. కాలనీవాసులు గోవర్ధన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, రామచందర్, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

హబ్సిగూడ: ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలే ఎజెండాగా తీసుకొని రాజకీయాలకు తావులేకుండా పనులు కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. హబ్సిగూడ డివిజన్ కామాక్షిపురంలో సీవరేజ్ పైపులైన్ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. జలమండలి జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ రవీందర్, బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, డాక్టర్ బీవీ.చారి, సోమిరెడ్డి, శివ, గణేష్, యాదమ్మ, ధనలక్ష్మీ, భాగ్యరేఖ, బీజేపీ నాయకులు ఎల్లాచారి, వెంకన్నగౌడ్, సోమయ్యగౌడ్, రఘు, సాయి, కాలనీవాసులు దుర్గేష్, నారాయణదాసు, శ్రీనివాస్, రవిశంకర్‌రెడ్డి, అంజయ్య, లింగం, వెంకన్నగౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కామాక్షిపురంలో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ చేతన

ప్రేమ్ కృతికకు బెస్ట్ కేడెట్ అవార్డు

మల్లాపూర్: న్యూఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 12వ తరగతి విద్యార్థిని ప్రేమ్ కృతికకు బెస్ట్ కేడెట్ సీనియర్ వింగ్ ఆర్మీ అవార్డు లభించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆమె బ్యాటన్ (లాఠీ) అందుకుంది. గురువారం పాఠశాలలో డీపీఎస్ విద్యా సంస్థల చైర్మన్ మల్కా కొమరయ్య, సీనియర్ జడ్జి మురళీమోహన్, పీఎల్ శ్రీనివాస్, సీఓఓ మల్కా యశస్వీ ప్రేమ్ కృతికను అభినందించి సత్కరించారు. అనంతరం పాఠశాల తరుపున చైర్మన్ మల్కా కొమరయ్య ఆమెకు రూ.50 వేలు అందజేశారు. 2020, 2023 గణతంత్ర వేడుకల్లో తెలుగు రాష్ట్రాల నుంచి ప్రేమ్ కృతిక పాల్గొన్నందుకు సంతోషంగా, గర్వంగా ఉందని చైర్మన్ కొమరయ్య అన్నారు. భవిష్యత్‌లో ఆమె ఐఏఎస్ అధికారి కావాలని ఆయన ఆకాంక్షించారు.



ప్రధాని మోదీ చేతుల మీదుగా లాఠీ అందుకుంటున్న ప్రేమ్ కృతిక

ఆకట్టుకుంటున్న వస్త్ర పదర్శన

అల్వాల్: తిరుమలగిరి ఆర్టీసీ కాలనీలోని లాలా మియా బస్తీలో వస్త్ర ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు వికాస్ జైన్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కళాసిల్క్ సొసైటీ హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వస్త్ర ప్రదర్శనకు అన్ని వర్గాల ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని, పండగలు వివాహ శుభకార్యాల సీజన్ ప్రారంభం కావడంతో షాపింగ్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. సంప్రదాయ ఫ్యాషనబుల్‌గా ఉండే ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. దేశంలోని ఎంపిక చేసిన చేనేత కళాకారులు సిల్క్ కాటన్ వస్త్రాలతో పాటు మహిళల కోసం ఎన్నో రకాల వస్తువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేత కళాకారులు తమ ఉత్పత్తులను 50కి పైగా స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్న తెలిపారు. ప్రదర్శన ఈనెల 28వ తేదీ వరకు కొనసాగుతుంది.



పేద యువతికి బీఎల్‌ఆర్ ట్రస్టు చేయూత



యువతికి నగదు అందజేస్తున్న బీఎల్‌ఆర్ ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి

కుషాయిగూడ: హెచ్‌బీకాలనీ, నవోదయనగర్ కాలనీకి చెందిన పేద యువతి రేణుక వివాహ ఖర్చుల నిమిత్తం బీఎల్‌ఆర్ ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి యువతి కుటుంబ సభ్యులకు గురువారం సాయాన్ని అందజేశారు. యువతి తల్లిదండ్రులు భూపతి నర్సింహులు, లక్ష్మీ, స్థానిక నేతలు ఉపేందర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



అవినాష్‌కు నగదు అందజేస్తున్న సాయిజెన్‌శేఖర్

ఫిట్‌నెస్ ట్రైనర్‌కు సాయం

మల్లాపూర్: నాచారం ప్రాంతానికి చెందిన ఫిట్‌నెస్ ట్రైనర్ అవినాష్ షుగర్ వ్యాధితో కుడి కాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు సాయిజెన్‌శేఖర్ గురువారం రూ.5 వేలతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. ఎవరైనా సాయం చేయాలనుకుంటే ఫోన్: 88971 95313 గూగుల్‌పే పంపవచ్చన్నారు.

‘బీజేపీ హయాంలోనే అదానీ ఆస్తులు పెరిగాయి’

కాప్రా: అదానీ ఆస్తులు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కనుసన్నల్లోనే ఒక్కసారిగా పెరిగాయని ప్రముఖ రచయిత బీపీ చారి అన్నారు. తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం కమలానగర్‌లోని కార్యాలయంలో అదానీ కుంభకోణం–ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పేరుతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014కు ముందు అదానీ పేరు ఎవరికీ తెలియదని, బీజేపీ అధికారంలోకి రాగానే అమాంతంగా ఆస్తులు పెరిగాయని ఆరోపించారు. ప్రభుత్వ సహకారం, ప్రభుత్వరంగ సంస్థల అండదండలతో వృద్ధి చెందాడన్నారు. ఎయిర్‌పోర్టులు, షిప్‌యార్డులు, బొగ్గు గనులను అదానీకి అర్పితం చేశారని విమర్శించారు. తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని మౌలాలి సబ్‌స్టేషన్ నల్ల పోచమ్మ ఆలయ కమిటీ కేలండర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ ప్రతినిధులు వారిని ఘనంగా సత్కరించారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ముత్యం వెంకన్నగౌడ్, బీజేపీ నేత రాంప్రదీప్, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మందా వెంకటేశ్వర్లు, రవీచంద్ర

అల్వాల్: కేసీఆర్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు నెలకు రూ.24 వేలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కే.రవీచంద్ర అన్నారు. అల్వాల్‌లో గురువారం వారు మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు స్థానిక సంస్థల నుంచి జీతాలు చెల్లించే విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వమే కార్మికులకు జీతాలు చెల్లించాలని అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. డీయస్, శేఖర్, జి.మహేందర్, కే. తిరుపతి, శ్రీనివాస్, యం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ అసోసియేషన్ బిల్డింగ్‌కు స్థలం కేటాయించాలి

కుషాయిగూడ: కాప్రా కార్పెంటర్ అసోసియేషన్ ప్రతినిధులు గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను గురువారం కలిసి వారి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ బిల్డింగ్‌కు స్థలం కేటాయించేలా చూడాలని కోరగా స్థలం కేటాయింపు అంశాన్ని అధికారులతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాజుచారి, జనరల్ సెక్రటరీ నర్సింహమూర్తి, కోశాధికారి సద్గురుచారి, వెంకటేష్‌చారి, గగన్‌కుమార్, భార్గవచారి, నర్సింహచారి, పూర్ణాచారి, సంపత్, రాంబాబు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



బొంతు రామ్మోహన్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాప్రా కార్పెంటర్ అసోసియేషన్ ప్రతినిధులు

ఇంటి స్థలాల సమస్యను ప్రస్తావించాలని వినతి

బోడుప్పల్: అసెంబ్లీ సమావేశాల్లో బోడుప్పల్ ఇంటి స్థలాల సమస్యను ప్రస్తావించాలని కోరుతూ వక్ఫ్ బాధితుల జేఏసీ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నేతలు గురువారం మధిర ఎమ్మెల్యే బట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం అందజేశారు. రిజిస్ట్రేషన్లు, ఇంటి అనుమతులను నిలిపివేయడం వల్ల వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున తమ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. జేఏసీ కన్వీనర్ శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, బొమ్మక్ కళ్యాణ్ కుమార్, నేతలు కొత్త కిశోర్‌గౌడ్ కాలనీవాసులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నేతలు

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



చర్లపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. చర్లపల్లిలోని శ్మశానవాటికకు వెళ్లె మార్గంలో సీసీ రోడ్డు పనులను గురువారం ఆమె ప్రారంభించారు. బొడిగె ప్రభుగౌడ్, జౌండ్ల సత్తిరెడ్డి, డప్పు యాదయ్య, డప్పు చిన్న యాదయ్య, కొమ్ము నర్సింగరావు, కొమ్ము సురేష్, లక్ష్మయ్య, అనిల్, నరసింహ, కృష్ణ, అశోక్, డప్పు సతీష్ ఉన్నారు.

దశలవారీగా హామీలను నెరవేరుస్తా

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని న్యూప్రశాంత్‌నగర్, సౌత్ ప్రశాంత్‌నగర్ బస్తీల్లో జరుగుతున్న వరద నీటి పైపులైన్ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, ఏఈ రాజ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలని, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. ప్రవీణ్‌ముదిరాజ్, బింగి శ్రీనివాస్, ఏదుల కొండల్ రెడ్డి, జగన్, బాలు, శ్యాం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



చిలుకానగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత తదితరులు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మల్కాజిగిరి: సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని గీతానగర్, ఓల్డ్ మల్కాజిగిరి ప్రాంతాల్లో జలమండలి, విద్యుత్, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. ఓల్డ్ మల్కాజిగిరి సరిగొండ నర్సింహారెడ్డినగర్ ఫంక్షన్ హాల్ వద్ద చేపట్టిన ఆర్‌సీసీ పైపులైన్ పనులను ఆయన పరిశీలించారు. జలమండలి మేనేజర్ వేణుగోపాల్, లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఏఈ మధురిమ, వీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు

కుషాయిగూడ: డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. వెంకటేశ్వరనగర్, తిరుమలనగర్ కాలనీల్లో చేపట్టిన పనుల్లో నాణ్యతను పరిశీలించారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, స్థానిక నేతలు నవీన్‌గౌడ్, కుమార్, వీరభద్రారావు, జయపాల్, శేఖర్‌గౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా సీఐటీయూ



సీఐటీయూలో చేరుతున్న ఆటోట్రాలీ డ్రైవర్స్

మల్కాజిగిరి: కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ అండగా ఉంటుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ అన్నారు. మల్కాజిగిరి మండల కార్యదర్శి నర్సింగరావు ఆధ్వర్యంలో డైట్ కాలేజీ వద్ద ఉన్న ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సీఐటీయూలో గురువారం చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు అండగా సీఐటీయూ ఉంటుందన్నారు. ఆటో కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. సీపీఎం మండల కార్యదర్శి ఎం.కృపాసాగర్, యూనియన్ నాయకులు రాజశేఖర్, శ్రీనివాస్, రజనీకాంత్, శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు.

‘బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించారు’

కాప్రా: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించి.. కేవలం ఎన్నికలపైనే దృష్టిపెట్టి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని ఏఐఎస్ఎఫ్ నేతలు ఆరోపించారు. ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఏ వర్గాలకు కూడా ప్రయోజనం కలిగేలా బడ్జెట్ లేదని, కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేలా ఉందని విమర్శించారు. డిజిటల్ విద్య, డిజిటల్ లైబ్రరీలకు ప్రాధాన్యం అంటున్న కేంద్రం పేద వారికి విద్యను దూరం చేస్తూ ప్రైవేటీకరణ చేసేలా బడ్జెట్ ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలను నిర్వీర్యం చేసేలా ప్రైవేటు యూనివర్సిటీలకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామన్నారు. ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, సభ్యులు ఎండీ సొహైల్, భాను, గణేష్ ఉన్నారు.